ఆంధ్రజనత దినపత్రిక: 26-7-1964

# ప్రేమగాథ

అవధరింపుడు -

కథాక్రమం బెట్టిదన -

నాయకుడు గోపాలం కాబట్టి, నాయిక రాధ కాక తప్పదు (రూల్సు మామూలే!)

**గోపాలుని ముఖస్తుతి :**

గోపాలం చాలా బావుంటాడు.... అనుకుంటాడు గోపాలం అద్దంలో చూసుకుంటూ! అప్పు కావల్సినప్పుడు అప్పారావు, "గోపాలం నిజంగా అందగాడు సుమా!" అనంటాడు. లేకపోతే అప్పు యివ్వడు కాబట్టి! మొదట్లో గోపాలానికి గోష్పాదమంత పిలక, చెవులకు

పొగులు అవీ వుండేవి. అమ్మాయిలు ఎగతాళిగా నవ్వటం వల్లనైతేనేమి, సహాధ్యాయులు 'కొత్తిమిర కట్ట' అని పిలవటం వల్లనైతేనేమి, గోపాలం మహాశయులు ఉక్రోషపడి, ఓ సుప్రభాతాన దాన్ని సమూలంగా పెరికి వేశాడు! (హతోస్మి)

నాయికావర్ణన :

అసలు పేరు అనూరాధ! ఎర్రగా చూడ ముచ్చటగా వుంటుంది. గుండ్రటి మొహం, కోటేరులా నాసిక, అరచెయ్యంత కళ్ళు, చిలిపిగా వుంటాయి. పండిన టొమాటోలా పెదవులు, దానిమ్మ గింజల్లా తీర్చి దిద్దినట్లుండే పలువరుస, శంఖులా మెడ, స్తన ద్వయం కూడా మోయలేనంత జవజవలాడే నడుము, కొండ రాళ్ళపై ప్రాకే నల్ల త్రాచులా జడ. అందులో తొంగిచూసే మందార పువ్వు.... సాక్షాత్తూ అనూరాధ విద్యార్థుల పాలిటి ఊర్వశి, మేనక వగైరా!

కథా ప్రారంభం :

ఓ మిట్ట మధ్యాహ్నం వేళ, గోపాలం ప్రాక్టికల్స్ పూర్తి చేసుకుని, బయట పడ్డాడు. అలా కాంపౌండులో పది గజాలు వెళ్ళేసరికి ఓ కోకిల కంఠం "గోపాలంగారూ!" అని పిలిచినట్లయి, తనను కాదు లెమ్మనుకుని, అయినా ఎందుకైనా మంచిదని చుట్టూ చూచాడు గోపాలం!

అనూరాధ కనిపించింది. అనూరాధ తనను పిలవదు... అన్న నమ్మకం బలంగా వుండటం చేత.... భ్రమ అనుకుని ముందుకు సాగాడు!

"అయ్యా! గోపాలంగారూ!"

గోపాలం ఈసారి భ్రమ కాదనుకున్నాడు. కల అంతకన్నా కాదు అన్న డైలమాలో, వుండేంతలో అనూరాధ దగ్గరికొచ్చి "పిల్చినా పలకటం లేదే!" అనంది నొచ్చుకుంటూ!

గోపాలం, "అనూరాధే.... నన్నే.... పలకరించటమే.... హ్వామ్మి! అవటా!" - అని ఆశ్చర్యం లోకి కాలు జారి, "వినపడ లేదండీ!" అని యిదయ్యాడు.

"ఫరవాలేదు లెండి!.... మీ కెమిస్ట్రీ నోట్సొకసారి యిస్తారా?"

"అయ్యో! దానికేమండి" అని మురిసిపోయి ఎన్నాళ్ల నుంచో చక్కగా, కష్టపడి వ్రాసు కున్న నోట్సు యిచ్చేశాడు.

అదొక ఘట్టం!

అది నాయికా నాయకులతో విపరిచయం!

సాయంత్రానికి ఎవరి నోట విన్నా, ఎక్కడ నిలబడ్డా వొకటే గోల! మరి యిలాంటివి అసలు దాగవాయి,

"అనూరాధ గోపాలన్ని లవ్వాడుతుంది!" అని ప్రచారం.

నేను నిత్య శంకితుణ్ణి! నమ్మలేదు.

"దాఖలా ఏమిటి?" అని ప్రశ్నించాను.

నన్నో వెఱ్ఱి వెంగళప్పగా జమేసుకుని, "ఓరి సన్నాసీ, యింక దాఖలా ఏమిట్రా నాయనా? కాలేజీలో మిట్ట మధ్యాహ్నం అనూరాధ స్వయంగా పలకరించి గోపాలరావు నోట్స్ తీసుకుంటే! యింతకన్నా మరేం కావాలి?" అని అన్నారు.

"ఎవరో చెప్పటమేనా చూచిన వాళ్ళున్నారా?"

తాము ఏ తత్ సమయంలో కాంపొండులోని చెట్టు క్రింద వున్నామని, కళ్ళారా చూచామని యిద్దరు బలమైన సాక్ష్యం గూడా యిచ్చారు. కాబట్టి కేవలం లాబీ వర్గాల అంచనా మాత్రమే కాదు.

కానీ నాకు ఆశ్చర్యంగానే వుంది. అనూరాధకు, గోపాలానికి నక్కకు, నాగలోకానికి వున్నంత తేడా వుందే.... అనూరాధ ఎలా ప్రేమించిందీ గోపాలాన్ని?

(డామిట్ అబద్ధం!)

"కేవలం పుస్తకం అడిగి తీసుకున్నంత మాత్రాన అది ప్రేమకు చిహ్నమని ఎలా అనగలం?"

నన్నో విషపురుగుగా చూచారు కొందరు. మిగతావాళ్ళు నా సంగతి తెలిసి, "అబ్బాయి! స్నేహం సాప్తపధీనం అన్నారు. ప్రేమా అంతే! పైగా అనూరాధ, సుజాతతో 'గోపాలం అందరి విద్యార్థుల్లోకి నాకు నచ్చాడు సుమా!' అనగా చలపాయి విన్నాడుట! ఏరా! కదూ?"

చలపాయి "అవును!" అన్నాడు.

ఇంకేం కావాలి?

దానాదీనా గోపాలం ప్రేమ సమ్రాట్టయ్యాడు. మేమంతా గోపాలాన్ని అభినందించ టానికి వెళ్లేసరికి వాడి గది నిండా, బయట పరిసర ప్రాంతాల్లో, అనూరాధ మాజీ ప్రేమి కులు, విడివిడిగా, జాలిగా మూగివున్నారు, రాణీ ఈగ దగ్గరుండే పోతుటీగల్లాగా (సిమిలీ....).

కుర్చీలో జారగిలబడి, అభిమానులచే పరివృతుండై సాక్షాత్తూ మంత్రి పదవి అయా చితంగా లంకించుకున్నవాడిలా - వాడి మొహం అప్పుడే మెర్క్యురీ బల్బులా వెలుగు తుంది. (వెలుగుట ఆరుట కొరకే -).

"గురూ! చెప్పు గురూ! అనూరాధ నిన్నెలా ప్రేమించింది గురూ! చెప్పు గురూ! విని సంతోషిస్తాం!"

ఓ మైనరు ప్రేమికుడు గోపాలానికి విసరసాగాడు. మమ్మల్ని చూసి గోపాలం అలవోకగా, ఠీవిగా నవ్వాడు, ప్రక్కనున్న వాణ్ణి పిలిచి ఏదో చెప్పాడు (చెవిలో రహస్యంగా).

"అయ్యా! మహాజనులారా, గోపాలరావుగారు విశ్రాంతి కోరుతున్నారు. తామంతా దయయుంచి వెళ్ళాలి!..... పదవయ్యా పద డేరా మేకులా కదలవేం?"

అందరూ బయట కొచ్చేస్తున్నారు. నేనూ వస్తుంటే గోపాలం వుండమన్నాడు.

అంతా వెళ్ళాక, "ఏరా! యిప్పుడా రావటం! రూంమేటువి గదా! ముందస్తుగా వచ్చి అభినందించొద్దూ నాకు తెలుసులేరా నీకు ఈర్ష్య! అనూరాధ నన్ను ఎన్నుకుందని!" అని చివాట్లేశాడు గోపాలం.

నేనేం మాట్లాడేది?

◆ ◆ ◆

"నాన్నా, నేను అనూరాధను ప్రేమించా!"

"అదే! ఎవర్నడిగీ అని"

"నాన్నా! మా ప్రేమ పవిత్రమైంది. మమ్మల్నెవ్వరు వేరు చెయ్యలేరు."

"ఓరి వెధవ! కులభ్రష్టుడవుతావురా! అదెవత్తో ఏమొ! అయినా నీకిదేం పొయ్యేకాలంరా! మీ మామ కూతురు సత్యను పెళ్ళి చేసుకుంటానంటే కాదూ, వాళ్ళు నీ చదువుకయ్యే ఖర్చు ఇచ్చుకుంటున్నది! మాట్లాడవేం?"

"నాన్నా! నన్నర్థం చేసుకోవేం! డబ్బుతో మా ప్రేమను విలువ కడతావా! యింతేనా!"

"వొరేయ్! నాయనా నా మాట విను! నన్నీ ముసలితనంలో కష్టపెడతావురా?"

"నన్ను మమకారాలు, సూర్యకారాలు చూపి భయపెట్టలేవు! అనూరాధ నా ప్రాణం!"

"సరే కానియ్! ఈనాటితో నీకూ, నాకూ ఋణం తీరిందనుకుంటాను! నా కసలు కొడుకు పుట్టనేలేదనుకుంటాను!"

అర్ధరాత్రి ఏమిటీగోల! నిద్రపట్టి చావటంలా! పైగా ఈ కేకలు! ఈ మధ్య గోపాలం నాన్న వచ్చి వెళ్ళాడు! అదిగో అప్పట్నుంచీ యిదే వరుస!

యిది విష్కంభం బనబడును.

కథ యిలా, ప్లిమత్ కారులా సిమెంటు రోడ్డు మీద, జోరుగా, హుషారుగా నడుస్తున్నది.

"రావే! నా చెలియా!"

"ఎందు దాగినావే? ప్రియతమా!"

వగైరా పాటలన్నీ పాడటం ప్రాక్టీసు చేయసాగాడు గోపాలం అద్దం ముందేసుకుని.

గోపాలం అనూరాధ వాళ్ళింటికి.... షికార్లకు, సినిమాలకు.... పిక్నిక్‌లకు వెళ్ళటం... చేస్తున్నాడుట.

"ఒరేయ్! డింభకా! (నేను) సమ్మర్‌లో పెళ్ళి! సుబ్బలక్ష్మి పాట కచేరి! నల్ల రామ్మూర్తి ట్రూపుచే "పామర సావిత్రి" నాటకం వుంటాయి! అన్నీ బాగానే వున్నాయి! హనీమూన్ (తెలుగులో తేనె చంద్రుడు.....)కి స్విట్జర్లాండ్ బావుంటుందా.... లేక సిమ్లాతో సరిపెట్టుకోమంటావా?" అని గూడ అడిగాడు! నాకు మటుకు ఏం తెలుసు. ఇంతలో ఇలా జరుగుతుందని? చూడండి - మూడు నిముషాల ముందు దాకా ముందేం జరుగుతుందో పసిగట్టలేం!

◆ ◆ ◆

ఆ వార్త విన్న వాళ్ళంతా ముక్కు మీద వేలేసుకున్నారు (లేనివాళ్ళేం చేశారు?.... లేనిది ముక్కా - వేలా - అది మీ యిష్టం! ఏది లేకపోయినా ఫలితం ఒకటే).

"ఎంతలో ఎంత జరిగింది!" అనుకున్నారు అంతా.

గోపాలం మొహం నయాపైసంత అయింది! జుత్తు పీక్కున్నాడు (నొప్పి పుట్టినంత వరకూ). కళ్ళు ఎర్రబడ్డాయి! మాసిన చొక్కా - (దానికో చినుగ్గూడ వుంది)..... చారల పైజమా....(వాడిదే).... చూడగానే "అయ్యో పాపం గోపాలుడు!" అన్నారు అంతా!

"ఏమిటి ఎందుకిలా అయ్యాడు!"

"పోదువో ప్రియతమా....!"

గోపాలం విరహ గీతాలు పాడుతూ.... అవకాశమున్నంత వరకూ అభినయమూ కొనసాగిస్తున్నాడు.

"ఇదో శుభలేఖ! చి॥ ల॥ సౌ॥ అనూరాధని ఆమె మేనమామ కుమారుడైన చి॥ కృష్ణమూర్తి బి.ఇ. (మిన్నెసోటా) కిచ్చి చిలకలవారిపాలెంలో వివాహం జరుప పెద్దలు నిశ్చయించినారు గాన సకుటుంబ (వుంటేనే సుమా) బంధుమిత్ర సపరివార సమేతంగా విచ్చేసి మత్కృత చందన తాంబూలాది (కాఫ్యాదులు వుండవని గాదు) నన్నానందింప చేయ ప్రార్ధన! మంగళం మహత్! ఇట్లు బుధ జన విధేయుడు.... వల్లభనేని రామభద్రయ్య!"

వ్యాఖ్యాన సహితంగా వినిపించాను!

"అనూరాధ ఉడ్‌బి భర్త స్వయంగా వచ్చి యిదిచ్చి మరీ మరీ ఆహ్వానించాడు! అదో అప్పట్నుంచి యిలాగయ్యాడు!"

"అంతే యిహ మన స్మృతి లేదు! కాఫీ యిస్తే గ్లాసు పుచ్చుకుని, కాఫీ అవునో కాదో చూచి నవ్వి, "నా కెందుకురా యివన్నీ! ఆత్మహత్యే శరణ్యం!" అంటాడు అని చెప్పాను.

♦ ♦ ♦

కథ కంచికి :

సాయంత్రానికి అనూరాధ మాజీ ప్రేమికుల సంఘం వారు.... గోపాలంకి సానుభూతి సభ ఏర్పాటు చేశారు ప్రతాపగిర్జీ కోఠీలో! యావన్మందినీ హాజరు కమ్మని మనవి చేశారు!

ఓ తీర్మానమూ తయారు చేశారు.

"అనూరాధ గోపాలాన్ని ప్రేమించి.... అర్ధాంతరంగా వదిలేసి కృష్ణమూర్తి బి.ఇ. (మిన్నెసోటా)ని వివాహం చేసుకోవటం అన్యాయము, అక్రమము, గోపాలం ఆత్మశాంతి కలుగుగాక" అని తీర్మాన పాఠానంతరం దీన్ని ఏకగ్రీవంగా అంగీకరించారు కూడ! సభానంతరం రెండు నిముషాలు మౌనంగా నిలబడాలి గోపాలం ఆత్మశాంతి కోసం!

షరా : ఈ కథ చదివినవారు, చెప్పగా విన్నవారు.... ఎవరి చేత ప్రేమింపబడరు. ఒకవేళ తెలియక ప్రేమించినా ఆ తరువాత తమ తప్పు తెలుసుకొందురు - వైస్ వెర్సా అయిపోయింది - మరి. ●